# తెలుగు వెలుగు



ఫిబ్రవరి 2016 వెల: ₹20



# వైజ్ఞానిక రచనలే తెలుగుకు రక్ష

**డాక్టర్ శ్రీనివాస చక్రవర్తి... మద్రాసు ఐఐటీ న్యూరో సైన్సు ఆచార్యులు. వృత్తిజీవితంలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ విజ్ఞానశాస్త్రాన్ని తేట తెలుగులో ప్రచారం చేయాలన్న లక్ష్యం ఆయనది. అందుకే, వివిధ భాషల్లోని పుస్తకాలను తెలుగులోకి అనువదిస్తున్నారు. 'శాస్త్రవిజ్ఞానం' పేరిట ఓ బ్లాగునూ నిర్వహిస్తు న్నారు. 'జాతీయ విజ్ఞానశాస్త్ర దినం' (ఫిబ్రవరి 28) సందర్భంగా తెలుగువెలుగు'తో ఆయన పంచుకున్న అభిప్రాయాల మాలిక...**

**తె.వె:వైజ్ఞానిక విశేషాలను తెలుగులో అందించాలనే ఆలోచన ఎందుకు కలిగింది?**

**చక్రవర్తి:** ఇంజినీరింగ్ అయిపోయాక ఎమ్మెస్, పీహెచ్‌డి కోసం ఎనిమిదేళ్లు అమెరికాలో ఉన్నాను. పరిశోధన కోసం ఎన్నో దేశాలు పర్యటించాను. చిన్నప్పటినుంచే పుస్తకాలంటే ఇష్టం ఉండటంతో, కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడల్లా అక్కడి గ్రంథాలయాలకు వెళ్లడం, పుస్తకాలను చదవడం, పరిశీలించడం అలవాటు చేసుకున్నాను. ముఖ్యంగా అమెరికా విశ్వవిద్యాలయాల గ్రంథాలయాల్లో పుస్తకాలు చూస్తే బోధకుడి అవసరమే ఉండదనిపిస్తుంది. అలాగే అక్కడి బడులు, కళాశాలల గ్రంథాలయాల్లోనూ విజ్ఞానశాస్త్ర పుస్తకాలు మన చందమామ కథల పుస్తకాల కంటే ఆసక్తికరంగా ఉంటాయి. నేడు వైజ్ఞానిక రంగాల్లో రాణిస్తున్న ప్రపంచదేశాల శాస్త్రవేత్తలందరూ బాల్యంలో అలాంటి పుస్తకాలు చదివినవాళ్లే. కానీ, మనదేశంలో... ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోనైతే పరిస్థితి పూర్తిగా విరుద్ధం.

మన గ్రంథాలయాల్లో రామాయణం, మహాభారతం, పురాణాలు, కథలు, నవలల లాంటివి తప్పితే విజ్ఞానశాస్త్ర పుస్తకాలు తెలుగులో కనిపించడం అరుదు. అంతా కాల్పనిక సాహిత్యమే. వాస్తవానికి, హేతువుకు పెద్దపీటవేసే రచయితలే లేరు. కొంతమంది రచయితలు ఏవో కొన్ని పుస్తకాలు రాసినా వాటిని ప్రామాణికంగా తీసుకోలేని పరిస్థితి. మన అమ్మభాషలో హాయిగా చదువుకునేందుకు అసలు సైన్సు పుస్తకాలే లేకుంటే, ఆ రంగంవైపు వెళ్లాలని విద్యార్థులు ఎలా అనుకుంటారు? ఆంగ్లంలో ఉన్న పుస్తకాలు అసలు ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకే అంతంత మాత్రం అర్థమవుతాయి. అందుకే తెలుగు పిల్లలకు ఈ లోటు భర్తీ చేసేందుకే బ్లాగు, రచనలు మొదలుపెట్టాను. ఇప్పటివరకు నేను రాసిన తెలుగు పుస్తకాలు, అనువాదాలు వందకుపైగానే ఉంటాయి.

**బ్లాగును కార్యరూపంలోకి తేవడానికి పడిన శ్రమ?**

దాని ప్రారంభానికి కొన్నేళ్ల ముందే పుస్తక రచన మొదలుపెట్టాను. విజ్ఞానశాస్త్రాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు, పిల్లల్లో ఆసక్తి పెంపొందించేందుకు ఆంగ్లంతోపాటు ఇతర భాషల్లోని ఆసక్తికరమైన విజ్ఞానశాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదిస్తున్నాను. వీటిలో పిల్లల్ని ఆకట్టుకునే శైలినే ఉపయోగిస్తున్నాను. నాకంటే ముందే ఇలాంటి బ్లాగును మహారాష్ట్రకు చెందిన ఆచార్యుడు అరవింద్‌గుప్తా ప్రారంభించారు. దానికి విశేష స్పందన లభించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి అయిన అరవింద్‌గుప్తా సైన్స్ ప్రసంగాన్ని నేను ఓసారి హైదరాబాదు ట్రిపుల్ ఐటీలో విన్నాను. బ్లాగును ప్రారంభించడానికి ఆ ప్రసంగమే ప్రేరణ. పైగా ఆధునిక సాంకేతికత పల్లెలకూ చేరుకుంటున్న సందర్భం ఇది... అందుకే పుస్తకాల కంటే బ్లాగ్ ద్వారా ఎక్కువమందికి చేరువ కావచ్చని నాగప్రసాద్ అనే మిత్రుడు సూచించారు. ఆయన కూడా మద్రాస్ ఐఐటీ పూర్వ విద్యార్థే. ప్రస్తుతం కడప రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకులు. ఆయన సహకారం ఫలితమే 'శాస్త్రవిజ్ఞానం' (scienceintelugu.blogspot.in). బ్లాగ్‌లో సమాచారం నాదే అయినా నిర్వహణ మాత్రం నాగప్రసాద్‌దే.

**బ్లాగుకు స్పందన ఎలా ఉంది?**

2008 నుంచి దాన్ని నిర్వహిస్తున్నాం. మా ప్రయత్నాన్ని మొదట చాలామంది నిరుత్సాహపరిచారు. అయినా పట్టుదలతో ముందుకెళ్లాం. ఇప్పటివరకు మా బ్లాగును 4 లక్షల మంది వీక్షించారు. 600 మంది బ్లాగుతో అనుసంధానమై ఉన్నారు. ఇందులో ఇతర భాషల విజ్ఞానశాస్త్ర వ్యాసాలు, పుస్తకాలు 950 దాకా తెలుగులో ఉన్నాయి. శాస్త్ర సాంకేతికతను తెలుగువారికి చేరువచేయడం, విద్యార్థులను ఆకర్షించడం బ్లాగు ప్రధాన లక్ష్యం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సైన్స్‌లో తెలుగువారు అట్టడుగున ఉన్నారన్నది మేము పరిశీలించిన అంశం. కథలు, నవలలు, ఇతిహాసం, పంచాంగం, వాస్తు పుస్తకాలు వేల సంఖ్యలో ఉన్నా సైన్స్ పుస్తకాలు తెలుగులో వెతికినా కనిపించవు. విజ్ఞానశాస్త్ర దారిద్ర్యానికి ప్రధాన కారణం ఇదే.

**ఈ పరిస్థితికి కారణం?**

మనదేశంలో ఇంగ్లీషుకు మితిమీరిన ప్రాధాన్యం ఇస్తున్నామనిపిస్తోంది. చాలాకాలంపాటు ఇది సరైందేనని నేనూ నమ్మాను. కానీ నాలుగు దేశాలు తిరిగాక నా అభిప్రాయం మారింది. అభివృద్ధి చెందిన అన్ని దేశాలలోనూ (తూర్పులోనైనా, పడమరలోనైనా) చదువు అక్కడి ప్రజల మాతృభాషలోనే జరుగుతోంది. ఇంగ్లీషు మాతృభాష కాని చైనా, జపాన్, కొరియా, యూరోపియన్ దేశాల్లో ప్రజలకు ఇంగ్లీషు ఒక భాషగా మాత్రమే తెలుసు. వైజ్ఞానిక పరిజ్ఞానం అంతా వాళ్ల మాతృభాషలోనే ఉంటుంది. మనదేశ భాషలు ఆ భాగ్యానికి నోచుకోలేదు. వైజ్ఞానిక సమాచారం విపరీతంగా పెరిగిపోతూ, ఇతర రంగాల పురోగతి ప్రగతి వైజ్ఞానికశాస్త్రం మీద ఆధారపడ్డ ఈ రోజుల్లో..

మనదేశ భాషల్లో తగినంతగా వైజ్ఞానిక పరిజ్ఞానం లేకపోవడం విచారకరం.

**వైజ్ఞానిక సమాచారం అమ్మభాషలో అందుబాటులో ఉంటే జరిగే మేలు?**

ఎంతోమంది తెలుగువాళ్లు ఇంగ్లీషు తెలిసినా కొన్ని పుస్తకాలు తెలుగులో ఉంటేనే చదువుతారు. ఇంగ్లీషులో ఉంటే చదవరు. కాబట్టి వీలైనంత మేరకు విలువైన సమాచారాన్ని తెలుగులోకి తెచ్చుకునేందుకు కృషిచేయాలి. ఆధునిక ప్రపంచం విజ్ఞానప్రపంచం. విజ్ఞానం అంటే భాషే. ఏ సమాజానికైనా తనదైన భాషలో ఎంత విలువైన సమాచారం ఉంటే ఆ భాషకు, సమాజానికి అంత గొప్ప భవిష్యత్తు ఉంటుంది. ఈ సమాచార సాంకేతిక యుగంలో విజ్ఞానాన్ని నిర్లక్ష్యం చేస్తే సమాజం నాశనమవుతుంది.

**తెలుగులో ప్రామాణిక సైన్సు పుస్తకాలు తక్కువ... అనువాదంలోనూ వెనకబడ్డాం కదా!**

మన సమాజంలో విజ్ఞానశాస్త్రం పట్ల అవగాహన గాని, అభిరుచి గాని సహజంగానే తక్కువ. సైన్స్ అంటే విద్యార్థులకు, శాస్త్రవేత్తలకు మాత్రమే సంబంధించిన వ్యవహారం అనుకుంటాం. అందరికీ అవసరమని అనుకోం. కారణం సైన్స్ బోధనలో విపరీతమైన పరిభాషను వాడి పాఠకులను హడలగొట్టడమే. అలా కాకుండా సైన్స్ విషయాలు సరళమైన భాషలో చెప్పే ప్రయత్నం జరగాలి.

పాపులర్ సైన్స్ సాహిత్యం లక్ష్యమూ అదే. మనదేశంలో పాపులర్ సైన్స్ ప్రచారం ఏదో కొంతమంది వ్యక్తులు పూనికవల్ల కొంతమేరకు జరిగింది కానీ, పాశ్చాత్య దేశాలలో లాగా ఓ అవిచ్ఛిన్న సంప్రదాయంలా లేదు. అలాంటి సంప్రదాయానికి ప్రాణప్రతిష్ఠ చేస్తేనే మనదేశంలో సైన్స్ పట్ల అవగాహన, అభిరుచీ పెరుగుతాయి. క్రీ.శ.11వ శతాబ్దంలో స్పెయిన్‌ను ఆరో అల్ఫాన్సో పాలించేవాడు. అది ఇంకా మధ్యయుగ ప్రారంభకాలమే. అప్పట్లోనే అల్ఫాన్సో యూరప్ నలుమూలల నుంచి పండితులను పిలిపించి, ఎన్నో అమూల్యమైన అరబిక్ వైజ్ఞానిక గ్రంథాలను స్పానిష్‌లోకి, తర్వాత లాటిన్‌లోకి తర్జుమా చేయించాడు. ఇప్పుడు మన రాష్ట్రాలు చేయాల్సింది అలాంటి బృహత్కార్యమే.

**విజ్ఞానశాస్త్ర పరిభాష అభివృద్ధికి ఎలాంటి మార్గాలు అనుసరించాలి?**

నిజానికి పరిభాష ఓ పెద్ద సమస్య కాదు. వైజ్ఞానిక సాహిత్యం అనగానే పరిభాష ఓ పెద్ద అవరోధం అనుకుంటారు చాలా మంది. కానీ, పాపులర్ సైన్స్ సాహిత్యంలో మామూలు భాషలో అందరికీ విషయం అర్థమయ్యేలా చెప్పాలి. మరోపక్క పరిభాషను పటిష్ఠం చేసే ప్రయత్నాలు కూడా జరగాలి. ప్రామాణికమైన పారిభాషిక పదకోశాన్ని ఎప్పటికప్పుడు తెలుగు అకాడమీ ప్రచురించాలి. తెలుగులో అపారమైన శబ్దపుష్టి ఉంది కానీ, పదాలను వాడకపోతే అవి పువ్వుల్లా వడలి రాలిపోతాయి. ఇప్పటివరకు ఉన్న పదకోశాలను (నన్నయ, అన్నమయ్య పదకోశం లాంటివి) కలుపుకుంటూ, వర్తమానంలో వార్తాపత్రికలు సృష్టించిన పదాలనూ సమీకరించుకుని సమగ్రమైన తెలుగు నిఘంటువునూ రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రస్తుతం తెలుగు భాష స్థితిగతులు ఎలా ఉన్నాయి?**

అత్యంత దయనీయంగా ఉన్నాయి. భాషను పునరుద్ధరించడం గురించి చాలా మంది మాట్లాడుతున్నారు. కానీ మనం



అనంతకృష్ణ

భాష అంటే కేవలం ఒక 'పాత్ర' అన్న సంగతి మరిచిపోతున్నాం. ఎంత రుచికర మైన పదార్థం ఉంటే పాత్రకి అంత విలువ, ఆదరణ. అది లేనప్పుడు ఎంత అరచి గీపెట్టినా ఆ భాషా సాహిత్యాన్ని ఎవ్వరూ పట్టించుకోరు. అందుకే నవతరం భారతీయ భాషలను నిర్లక్ష్యం చేస్తోంది. ఎందుకంటే వారి వృత్తి జీవితానికి, ఎదుగు దలకు వారి మాతృభాషకి సంబంధం కనిపించదు మరి! తెలుగుకు ప్రాచీన భాషా హోదా వచ్చిందని గర్వపడతాం. భవిష్యత్తు అనిశ్చితంగా ఉన్న భాష ఎంత ప్రాచీనమైతే ఏం లాభం? తెలుగులోనే కాదు నేను చూసినంత మేరకు ఒక్క మల యాళాన్ని మినహాయిస్తే మన భాషల్లో అకల్పిత సాహిత్యం చాలా తక్కువ. మన దృష్టిలో సాహిత్యం అంటే కవితలు, కావ్యాలు, కథలు, నవలలు, ఇతిహాసాలు, పురాణాలే. కానీ, అకల్పిత సాహిత్యంలో సమాజాల రాతలు మార్చిన పుస్తకాలు ఉన్నాయి. కార్ల్‌మార్క్స్ రాసిన 'దాస్ కాపిటల్' రష్యా విప్లవానికి ఊపిరి పోసింది. ఐజాక్ న్యూటన్ 'ప్రిన్సిపియా' కొన్ని శతాబ్దాలపాటు వైజ్ఞానిక ఒరవడుల మీద ప్రభావం చూపించింది. మరి మన దగ్గర ఈ లోకం కంటే 'పర'లోకానిదే ప్రాధాన్యం. దాంతో ప్రపంచాన్ని విడమర్చి చెప్పే వస్తుగత శాస్త్రాలను నిర్లక్ష్యం చేస్తూ వచ్చాం. అందుకే ఉన్న కాస్త అకల్పిత సాహిత్యంలో కూడా మనం పరిగణించే అంశాలు చాలా తక్కువ. అందుకే ఓ వందమంది తెలుగువాళ్లు పూనుకుని తలా ఒక పది అద్భుతమైన అకల్పిత గ్రంథాలు రాస్తే బాగుంటుంది. ఒక్కొక్క పుస్తకం ఒక ముఖ్యమైన రంగాన్ని గురించి సరళంగా సమాజానికి పరిచయం చేయాలి. అదే జరి గితే ఆ వెయ్యి పుస్తకాలు తెలుగు జాతి రాతను మారుస్తాయి.

**ఇష్టమైన తెలుగు పుస్తకాలు, రచయితలు?**

తెలుగు సాహిత్యంతో నాకు విస్తృతమైన పరిచయం లేదు. కొన్ని ముఖ్యమైన పుస్త కాలు చదివాను. విశ్వనాథ 'వేయిపడగలు' చాలా ఇష్టం. ఒకదశలో ఆ పుస్తకాన్ని సర ళంగా తిరగరాసే ప్రయత్నం మొదలుపెట్టి, కొన్ని అధ్యాయాలు రాసి మధ్యలో వదిలిపెట్టాను. బుచ్చిబాబు 'చివరికి మిగి లేది' నామీద బలమైన ముద్రవేసింది. 'కన్యాశుల్కం' చదివితే ఓ పుస్తకం ద్వారా సామాజిక సంస్కరణ ఎలా సాధ్యమో అర్థ మవుతుంది. తెలుగు పౌరుషం తెలియా లంటే 'మహాప్రస్థానం' చదవాలి.

**సమాజంలో అమ్మభాష మీద అభిమానం పెంచాలంటే?**

తల్లిని ప్రేమించమని, తల్లిభాషను ప్రేమిం చమని ఒకరు చెప్పాలా? నిర్మాణాత్మకంగా పనిచేస్తూ తెలుగు సాహిత్యాన్ని ఆధునిక అవసరాలకు సరిపోయే విధంగా పోషిస్తూ పోతే తెలుగు సాహిత్యం పట్ల తెలుగువా రికి నూతనోత్సాహం కలుగుతుంది. ఈ ప్రయత్నంలో కొన్ని చిట్కాలు... ఇంగ్లీ షులో లభ్యమయ్యే స్క్రాబెల్, పిక్షనరీ, టబూ వంటి ఆటలని తెలుగులో రూపొం దించాలి. సరదా కథలతో, పదాల ఆవి ర్భావ చరిత్రను, పదాల వ్యుత్పత్తిని వెల్లడిచేస్తూ శబ్దపుష్టిని పెంచే పుస్తకాలు రాయాలి. తెలుగు పదాలతో ఆటలకి సంబంధించిన ఆప్‌లు తయారుచేయాలి. ఏ భాషలోనైనా విలువైన అంశం ఉంటే, దానిని తెలుగులోకి తెచ్చుకోవాలన్న పట్టుద లతో ప్రతీ తెలుగువాడు పనిచేయాలి. అప్పుడు తెలుగు స్వరూపం పూర్తిగా మారి పోతుంది. ప్రస్తుతం సమస్యలు అనుకునేవి

**తెలుగులో విజ్ఞానశాస్త్ర ప్రాధాన్యం పెరగాలంటే...**

- ఆంగ్లంతోపాటు ఇతర భాషల్లోని ప్రముఖ సైన్స్ పుస్తకాలను తెలుగులోకి అనువదించాలి.
- ప్రముఖ ఇంగ్లీషు ప్రచురణకర్తలతో పొత్తు కుదుర్చుకొని సైన్స్ సాహిత్యాన్ని తెలుగులోకి తెచ్చుకోవాలి.



- తెలుగులో సైన్స్ వెబ్‌సైట్లని రూపొం దించాలి. వికీపీడియాలో సైన్స్ వ్యాసాల సంఖ్య పెంచాలి.
- గ్రంథాలయాల్లో సైన్స్ పుస్తకాల సంఖ్య పెంచాలి.
- వివిధ రంగాల నిపుణులు పల్లె బడు లకి వెళ్లి తమ రంగంలోని విశేషాల గురించి ఉపన్యాసాలు ఇవ్వాలి.
- ఈ రోజుల్లో పల్లె ప్రాంతాలలో కూడా ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. విద్యార్థుల్లో ఔత్సాహికులు పల్లెలకు వెళ్లి అక్కడ సరదాగా పాఠాలు చెప్పటం, ప్రయోగాలు చేసి చూపించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలి.
- బిగ్ బ్రదర్, బిగ్ సిస్టర్ మిషన్- ఉన్నత చదువులు చదువుకున్న వారు పల్లెల్లో చదువుకునే విద్యార్థులకు 'అన్న య్యగానో, అక్కయ్యగానో' వ్యవహ రిస్తూ వృత్తి జీవనానికి, వృత్తి ఎంపికకు సంబంధించిన అంశాల్లో కౌన్సిలింగ్ ఇస్తూ ఉండాలి.
- సైన్స్ అంశాల మీద తెలుగులో టీవీ కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిం చాలి.
- తెలుగులో సైన్స్, సైన్స్ ఫిక్షన్ సినిమాలు రావాలి.
- నాటకాలు, కథలు, సాంప్రదాయిక మాధ్యమాలైన బుర్రకథలు, తోలుబొ మ్మలు మొదలైన పద్ధతులతో సైన్స్ ప్రచారం చేయాలి.
- పాఠ్య పుస్తకాలకు అనుబంధ సమాచా రాన్ని అందిస్తూ వెబ్‌సైట్లు రావాలి.
- ఉద్యమ స్ఫూర్తితో పనిచేసే ఉపాధ్యా యులను గుర్తించి, వాళ్లని ప్రోత్సహిం చాలి.

– డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి

ఇట్టే మాయమైపోతాయి.

**తెలుగు మాధ్యమ చదువుల మీద నిరాసక్తత పెరుగుతోంది కదా!**

చెప్పాను కదా... భాష ఒక పాత్ర లాంటిది. మనం పాత్రకి అనవసరంగా అతిగా ప్రాధాన్యమిస్తున్నాం. ఇంగ్లీషుకు ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం అందులో లభ్యమయ్యే పరిజ్ఞానం. భారతీయ భాషల్లో కూడా ప్రపంచ పరిజ్ఞానం అంతా లభ్యమైతే వాటి విలువ కూడా పెరుగుతుంది. 'భాషాభిమానం' దానికదే పుట్టుకొస్తుంది. తెలుగు మాధ్యమంలో చదివినవారు ఒక స్థాయికి మించి ఎదగలేక పోవచ్చనే వాదనలో కొంత సత్యం లేకపోలేదు. సమకాలీన ప్రపంచానికి సంబంధించిన ఎంతో విలువైన పరిజ్ఞానం తెలుగులో (ఇతర భారతీయ భాషల్లో కూడా) లేదు. దాన్ని తెలుగులోకి తెచ్చుకున్నప్పుడే అది తెలుగుకి, తెలుగు మాధ్యమంలో చదువుకునేవారికీ మేలుచేస్తుంది. సమకాలీన పరిస్థితుల్లో ఒకస్థాయి వరకు స్థానిక భాషలో విద్యాబోధన జరిగినా, ఉన్నతవిద్య ఇంగ్లీషులో ఉంటేనే మంచిది. ప్రాంతీయభాష నుంచి ఇంగ్లీషు మాధ్యమానికి జరిగే మార్పు నాలుగైదేళ్ల వ్యవధిలో నెమ్మదిగా జరగాలి. విద్యార్థులకు రెండు మాధ్యమాలూ అందుబాటులో ఉండాలి. నిర్ణయం తల్లిదండ్రులకే వదిలివేయాలి. మాధ్యమం ఏదైనా బోధన, పాఠ్యపుస్తకాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలి.

**ఆంగ్ల మాధ్యమం వల్ల పిల్లల మీద ఒత్తిడి పెరుగుతోంది కదా!**

ఆంగ్ల మాధ్యమ పాఠ్యపుస్తకాలలో సిలబస్ మరీ ఎక్కువగా ఉండటం దీనికో కారణం. ఐసీఎస్‌సీ 12వ తరగతి సైన్స్ సబ్జెక్టులో ఒక్కొక్క పుస్తకం నిడివి 1500 పేజీల దాకా ఉంటుంది. మరి పిల్లలమీద ఒత్తిడి పెరగక ఏమవుతుంది? ఇలాంటి పుస్తకాలు విద్యార్థులు చదవడం అలా ఉంచితే, ఒక విద్యా సంవత్సరంలో చదవడం ఆచార్యులకూ కష్టమే.

**తెలుగు మాధ్యమ విద్యార్థుల్లో మీరు గమనించిన అంశాలు?**

నేను సందర్శించిన పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అనేక విషయాలు గ్రహించాను. ఎంత చిన్న పల్లెలోనైనా సహజమైన ప్రతిభ ఉండే పిల్లలు ఎంతోమంది ఉంటారు. వారికి కావాల్సిన సహాయం అందేలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టవచ్చు. విశ్వవిద్యాలయాల ఆచార్యులు ఏదో ఒక రీతిలో ఔట్‌రీచ్ కార్యక్రమాలు చేపట్టాలి. బడులకు వెళ్లి వివిధ విద్యా సంబంధ అంశాలమీద ఉపన్యాసాలు ఇవ్వడం, ప్రయోగాలు చేసి చూపించటం, క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లడం, పుస్తకాలు రాయటం, వెబ్‌సైట్లు, బ్లాగులు రూపొందించటం మొదలైన కార్యక్రమాలు లాంటివి ఎన్నో చేయవచ్చు. అలాగే మన విశ్వవిద్యాలయాలు ఆక్స్‌ఫర్డ్ ప్రెస్ లాంటి పాశ్చాత్య ప్రచురణ సంస్థలతో ఒప్పందం చేసుకుని, ముఖ్యమైన పుస్తకాల కాపీరైట్లు కొనుక్కొని వాటిని తెలుగులోకి అనువదించే ప్రయత్నం చేస్తే బాగుంటుంది. తెలుగురాష్ట్రాల్లో నిరక్షరాస్యత ఎక్కువ. 21వ శతాబ్దంలో ఇంత ముఖ్యమైన రంగంలో వెనకబాటుతనం ప్రమాదకరం. ఇంత మౌలికమైన లక్ష్యాన్ని ప్రభుత్వానికే వదిలేయకుండా ప్రతి ఒక్కరూ నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి.

**ప్రస్తుతం మన విద్యావ్యవస్థలోనే ఒక రకమైన గందరగోళం నెలకొంది కదా!**

మనం వ్యవస్థలో ఎన్నో లొసుగులు చూస్తూ ఫిర్యాదులు చేస్తుంటాం. కానీ పిండి కొద్దీ రొట్టె అన్నట్టు... ఏ సమాజంలోనైనా 'ప్రజలు ఎంతో వ్యవస్థలూ అంతే'. ఒక విద్యాసంస్థలో దొంగ సర్టిఫికెట్లు ఇస్తున్నారనుకున్నాం. మరో సంస్థలో అవగాహన మీద కాకుండా మార్కుల మీదనే ధ్యాస ఉందనుకుంటే, అలాంటి సంస్థలు చలామణి అవుతున్నాయంటే ప్రజలకు అవే కావాలని అర్థం కదా! కాబట్టి విద్యా వ్యవస్థలో లోపాలు ఉంటే దానికి సమాజం స్పందించి మేలైన విద్యాసంస్థల స్థాపనకు పూనుకోవాలి. దీనిపట్ల అవగాహన కల్పించేందుకు ప్రపంచంలో అతిగొప్ప విద్యాసంస్థల గురించి మన సమాజానికి పరిచయం చేయాలి. అక్కడి విధానాలు ఎలా ఉంటాయో, ఆచార్యులు ఎలా పనిచేస్తారో, ఎలా ఆలోచిస్తారో, విద్యార్థులు చదువుల్లో ఎలా పాల్గొంటారో అన్నీ విపులంగా చర్చించాలి. సమాజంలో చైతన్యం వస్తేనే మార్పు సాధ్యం.

---

**విజ్ఞానశాస్త్ర మార్గదర్శి:** శ్రీనివాస్ చక్రవర్తి స్వస్థలం విశాఖపట్నం. మద్రాస్ ఐఐటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేసిన శ్రీఆయన అమెరికాలోని టెక్సాస్ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రస్తుతం మద్రాస్ ఐఐటీ బయోటెక్నాలజీ విభాగంలో న్యూరో సైన్స్ ఆచార్యులు. ఆయనకు విజ్ఞానశాస్త్రం అంటే ఎంతో ఇష్టం. భారతీయ సంస్కృతిలో సైన్స్‌ను ఓ భాగం చేయాలన్నది ఆయన ఆశ. తెలుగులో విజ్ఞానశాస్త్ర పుస్తకాల కొరతను తీర్చేందుకు వివిధ భాషల పుస్తకాలను అనువాదం, సొంతంగా రాయడం చేస్తున్నారు. వాటిలో రెమ్మలు రమ్మన్నాయి (జగదీశ్ చంద్రబోస్ జీవితచరిత్ర), బొమ్మలలో ఖగోళశాస్త్రం, భౌతికశాస్త్రం ఎలా మారింది, 'నేర్చుకోవడం పిల్లల నైజం' లాంటి అనువాదాలు; మూడడుగుల్లో విశ్వం, భూమి గుండ్రంగా ఉంది, భూమి తర్వాత ఎక్కడ?, అంకెల మాంత్రికుడు రామానుజన్ లాంటి సొంత రచనలు వందదాకా ఉన్నాయి. అన్నీ సరళమైన భాషలో ఆసక్తికరంగా ఉంటాయి. తరగతులు, పరిశోధనల్లో ఎంత నిమగ్నమైనప్పటికీ ప్రతీ రోజు క్రమం తప్పకుండా కొంత సమయాన్ని బ్లాగు, పుస్తక రచనలకు కేటాయిస్తారు. పగలంతా వృత్తి జీవితానికి సంబంధించిన కృషిచేస్తే.. సాయంత్రం తెలుగులో సైన్స్ రచనలు సాగిస్తారు. భారతీయ భాషల్లో విజ్ఞానశాస్త్ర విషయాలు నేర్చుకునేందుకు 'కెలిడియోస్కోప్' ప్రాజెక్టును మొదలుపెట్టారు. అందులో పనిచేసే విద్యార్థులు చదువులు పూర్తిచేసుకుని వెళ్లిపోవడంతో, ఆ ప్రయత్నం మరో రూపంలో కొనసాగిస్తున్నారు. దీనికింద సైన్స్ పుస్తకాలను తమిళంలోకి అనువదిస్తున్నారు. వాటిని తమిళనాడు గ్రామీణ విద్యాలయాలకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి ఎయిడ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ సాయం అందిస్తోంది.

---



**మహ్మద్ ఆర్.హెచ్.షరీఫ్**
తిరుపతి, 78937 61212